నీలమణిదుర్గను దర్శించుకున్న ఎస్‌పి

పాతపట్నం : పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదివారం దర్శించుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, యాత్రికులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని ఎస్‌పి అందజేశారు.

జీడి... గిట్టుబాటు ఏదీ?

- పడిపోయిన జీడి పిక్కల ధరలు
- ధర లేక రైతుల ఆందోళన
- జీడిపప్పు ధర మాత్రం పెరుగుదల
- చేష్టలుడిగి చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- నేడు సచివాలయాల వద్ద జీడి రైతుల నిరసన

ఎక్కడైనా ఉత్పత్తి, ముడిసరుకుల ధరలు పెరిగితే ఆ వస్తువు ధర పెరుగుతుంది. జీడిపిక్కల విషయంలో మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. జీడిపిక్కల ధరలు పడిపోతే, జీడిపప్పు ధర మాత్రం పెరుగుతోంది. వ్యాపారుల మార్కెట్ మాయాజాలానికి ఇది నిదర్శనం. ధర లేక, గిట్టుబాట కాక రైతులు ఇంట్లోనే జీడిపిక్కలను నిల్వ చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. మరికొందరు రైతులు అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చిన ధరకు తెగనమ్ముకుంటున్నారు. పెట్టిన పెట్టుబడులూ రాక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అయినా ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. దీంతో రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జీడి రైతులు సచివాలయాల వద్ద నేడు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ప్రజాశక్తి - పలాస

పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట ఉద్దానం ప్రాంతాలతో పాటు జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. ఈ పంటే జీవనాధారంగా సుమారు 80 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తిత్లీ తుపాను జీడి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. తుపానుకు ఎక్కడికక్కడ నేలకొరిగిన చెట్లు తొలగించేందుకు పెట్టుబడులు పెట్టగా, మరోవైపు ఉన్న చెట్ల దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాడైన చెట్ల స్థానంలో కొత్త జీడి మొక్కలను పెంచుతున్నారు. మూడేళ్లగా దిగుబడులు తగ్గి తీవ్ర నష్టాలు చవిచూసిన రైతులకు ఈ ఏడాది జీడి పిక్కల దిగుబడి పెరగడంతో అప్పుల ఊబి నుంచి ఎంతోకొంత గట్టెక్కవచ్చని సంతోషించారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆ ఆనందం వారిలో ఆవిరైంది. ఇటీవలి కాలంలో 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.ఎనిమిది వేలు ఉండగా, జీడిపిక్కలు పంట వచ్చేసరికి ఒక్కసారిగా ఆ ధర 6 వేల నుంచి 7 వేలకు పడిపోయింది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు ధర రాకపోగా, మరీ అంత తక్కువ ధరకు అమ్ముకోలేక ఇళ్లల్లోనే జీడి పిక్కల బస్తాలను ఉంచారు. కొందరు రైతులు చేసిన అప్పుల వడ్డీలు కట్టేందుకు, ఇతర కుటుంబ అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో బస్తాను రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు తెగనమ్ముకున్నారు. గతేడాది కన్నా ధర

జీడి తోటలో పండు నుంచి పిక్కలను వేరు చేస్తున్న జీడి రైతు

పెరుగుతుందని భావిస్తే, అంతకంటే తగ్గడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.తొమ్మిది వేలు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం నుంచి అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గతంలో హామీనిచ్చారు. ఆ హామీ నేటికీ నెరవేరకపోగా, ఉన్న ధర కూడా పతనమవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

చేష్టలుడిగి చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

జిల్లాలో పండిన జీడిపిక్కలను కొనుగోలు చేశాకే విదేశీ పిక్కలను దిగుమతి చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యాపారులు మాత్రం ఇష్టానుసారంగా విదేశీ జీడిపిక్కలను దిగుమగి చేసుకుని, ఉద్దానంలో పండిన జీడిపిక్కలను తూతూమంత్రంగా కొనుగోలు చేసి రైతులకు ఎంతో కొంత మొత్తాన్ని ముట్టజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంలో జీడి రైతులు, వ్యాపారులను సమన్వయం చేయాల్సిన పాలకులు, అధికారులు ఆ పని చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పైపెచ్చు వ్యాపారులకే వత్తాసు పలుకుతుండడంతో రైతుల ఇబ్బందుల రెట్టింపు అవుతున్నాయి. జీడిపంట సాగుకు ఎకరాకు సుమారు రూ.20 వేలు

ఇంటి వద్ద నిల్వ ఉన్న జీడిపిక్కల బస్తాలు

పెట్టుబడి పెడుతున్నామని, పెట్టిన పెట్టుబడులూ రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు కొనడం కాకుండా రైతుభరోసా కేంద్రాల ద్వారా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుంటే ఎంతోకొంత ధరకు వ్యాపారులకు విక్రయించడం కంటే పిక్కలను కాల్చి నిరసన తెలిపేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని మాకనపల్లిలో ఇటీవల సమావేశమైన రైతులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తే రైతులను ఆదుకునే పరిస్థితి ఉంటుంది.

నేడు సచివాలయాల వద్ద ధర్నా

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సచివాలయాల వద్ద సోమవారం ధర్నా చేపడుతున్నట్లు జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పరిశోధనా కేంద్రాలను ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని కోరారు. జీడిపంట విస్తరణకు, జీడితోట పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే జీడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. రైతుల అవసరాలను అదునుగా చేసుకుని వ్యాపారులు ఇష్టమొచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు.

- కుత్తం వినోద్ కుమార్, జీడి రైతు, మాకన్నపల్లి

దిగుబడి పెరిగినా ఫలితం లేదు

మూడేళ్లగా చూసుకుంటే ఈ ఏడాది పంట దిగుబడి పెరిగింది. అయినా ఫలితం లేకుండా పోయింది. గతేడాది కన్నా ధర తగ్గిపోయింది. జీడిపప్పు ధర మాత్రం పెరిగింది. నష్టానికి పిక్కలు అమ్మలేక ఇంటి వద్దే నిల్వ చేసుకుంటున్నాం.

- తామాడ త్రిలోచనరావు, జీడి రైతు, బొడ్డపాడు

ఆందోళన చేస్తున్న కార్మికులు

'మెట్కోర్ అల్లాయిస్' లాకౌట్

పరిశ్రమ తెరిపించాలని కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మండలంలోని రావివలసలో గల మెట్కోర్ అల్లాయిస్ పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించింది. పరిశ్రమ గేటుకు లాకౌట్ నోటీసులను ఆదివారం అంటించింది. దీంతో పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు 700 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. లాకౌట్ విషయం తెలుసుకున్న కార్మికులు పరిశ్రమ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పరిశ్రమను తెరిపించాలని నినాదాలు చేశారు. 2014లో మూతపడిన ఈ పరిశ్రమ ఏడాదిన్నర కిందట మళ్లీ ప్రారంభమైంది. స్థానికులకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించకపోవడం, రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన బకాయిలు, ఇతర సౌకర్యాలు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, ఇతర సౌకర్యాల కల్పన విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పలుమార్లు కార్మికులు రోడ్డెక్కారు. కనీస వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ కాంట్రాక్టు కార్మికులు, రోజువారీ కూలీలు కొన్ని నెలలుగా సమ్మె చేస్తున్నారు. 400 రెగ్యులర్ కార్మికులకు కూడా పని కల్పించకుండా 15 రోజులుగా పరిశ్రమను మూసివేసింది. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో పాటు కార్మికశాఖ అధికారులకు కార్మికులకు పలుమార్లు



గేటుకు అంటించిన నోటీసులు

వినతిపత్రాలు అందించారు. ఈ నేపథ్యంలో యాజమాన్య ప్రతినిధులు, కార్మికుల మధ్య చర్చలు జరిగినా ఫలించలేదు. కొద్దిరోజుల కిందట సబ్ కలెక్టర్ పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చలేమని యాజమాన్య ప్రతినిధులు చెప్పారు. ఉత్పత్తిని తిరిగి ప్రారంభిస్తామని నమ్మిస్తూ ఈనెల 19వ తేదీన పరిశ్రమలోని రూ.కోట్ల విలువ చేసిన సరుకును తరలించిందని కార్మికులు చెప్తున్నారు. తాజాగా ఆదివారం పరిశ్రమ గేటుకు నో వర్క్ - నో పే, లాకౌట్ నోటీసులను అంటించారు. దీంతో పరిశ్రమలో పనిచేస్తున్న 400 మంది రెగ్యులర్, 300 మంది కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రభుత్వం స్పందించి పరిశ్రమను తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

సైకత ఎన్‌టిఆర్

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు శత జయంతిని పురస్కరించుకుని ఆయన సైకత శిల్పాన్ని సైకత శిల్పి గేదెల హరికృష్ణ చెక్కారు. మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలోని సంగమేశ్వర స్వామి కొండ దిగువన వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అప్పలసూర్యనారాయణ తదితరులు

తెలుగు వారి గుండెచప్పుడు ఎన్‌టిఆర్

- మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ
- ఘనంగా శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకే దక్కుతుందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతిని పురస్కరించుకుని టిడిపి శ్రేణులు ఆదివారం పలు కార్యక్రమాలు చేపట్టాయి. నగరంలోని ఏడు రోడ్ల కూడలి, సూర్యమహల్ కూడళ్లలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్‌టిఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యాన అప్పలసూర్యనారాయణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో విశ్వ విఖ్యాత నటుడిగా పేరుగాంచిన ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఆయన ఆశయాలను నెరవేరుస్తూ తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణావు, ఉంగటి రమణ, గుత్తు చిన్నారావు, వెంకన్న యాదవ్, విబూది సూరిబాబు, గుప్త, దుంగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటిస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

దళితుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - ఆమదాలవలస

దళితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. మున్సిపాల్టీ పరిధిలోని గాంధీనగర్ ఎస్‌సి కాలనీలో డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతితో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీ హయాంలో దళితుల అభ్యున్నతికి, వారి జీవన స్థితిగతుల మెరుగుకు పలు పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు దళితుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం నవరత్నాల పథకాల కోసం మళ్లించి దళితుల అభివృద్ధికి అడ్డుకట్ట వేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక దళితులపై దాడులూ పెరిగాయన్నారు. దళితుల పక్షపాతి అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఈ నాలుగేళ్ల కాలంలో వారి అభివృద్ధికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే జిల్లాకు వచ్చానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రీకాకుళం పట్టణాధ్యక్షులు గోవింద మల్లిబాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రెల్ల సురేష్, ఎస్‌సి సెల్ రాష్ట్ర సమన్వయకర్త బొత్స రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బస్వా షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి ఇవే చివరి ఎన్నికలు

- చంద్రబాబువి దివాళా రాజకీయాలు
- పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు వచ్చే సార్వత్రిక ఎన్నికలే చివరి ఎన్నికలు అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని ఉంద్రుకుడియాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు అని విమర్శించారు. చంద్రబాబు డిక్షనరీలో వెన్నుపోటు, మోసం, దగా తప్ప నీతి, నిజాయితీ మచ్చుకైనా కనిపించవన్నారు. పిల్లను ఇచ్చిన మామ ఎన్‌టిఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆ మహా నటుడు ప్రాణాలు తీసి ఇప్పుడు మహానాడులో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలదండ వేయడం చంద్రబాబు దివాళా రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసినా, ఏ రోజైనా పేదల కోసం పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. ఇప్పుడు సంక్షేమ మేనిఫేస్టోను విడుదల చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు తన మనుషులు, తన సామాజిక తరగతి బాగోగులు చూసుకుంటే, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించే విధంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు చేరువ చేయడమే ధ్యేయమన్నారు. సర్పంచ్ ప్రతినిధి కొర్ల వెంకటేష్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ప్రణాళికా సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు హనుమంతు వెంకటరావుదొర, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యనాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినాన శాంతారావు, మల్లా రవికుమార్, ఎంపిటిసి యు.కామేశ్వరరావు, సర్పంచ్‌లు కె.మల్లేశ్వరస్వామి, చింత హేమారావు, కొల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా శరత్

ప్రజాశక్తి - కవిటి

ఈనెల 29 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించనున్న ఖేల్ ఇండియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కవిటికి చెందిన తుంగాన శరత్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఎపిబిఎ ప్రధాన కార్యదర్శి అంకమ్మ చౌదరి ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేసినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు తమరాల జయరాం తెలిపారు. ఉద్దాన ప్రాంతం నుంచి తొలిసారి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన శరత్‌కు ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ లోళ్ల రాజేష్, ఉపాధ్యక్షుడు బెందాళం రమేష్, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ శేఖర్, మాజీ అధ్యక్షులు ఎ.మధు, కార్యదర్శి పులకల వెంకటరావు, క్రీడాకారులు ప్రసాద్, ఆర్.ఈశ్వరరావు, పి.ఉమ, బి.విశ్వనాథం తదితరులు అభినందనలు తెలిపారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

డిఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ మజ్జి మదన్మోహన్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ఫ్యాప్టో ఆధ్వర్యాన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను తుంగలో తొక్కి ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తాత్కాలికంగా ప్రమోషన్ పోస్టులో పనిచేయాలని చెప్పడం అన్యాయమన్నారు. తాత్కాలిక ప్రమోషన్లతో ఉపాధ్యాయులు కొత్త ప్రాంతాల్లో పనిచేశాక వాటిని రద్దు చేసి, మళ్లీ ప్రమోషన్ల ప్రక్రియకు తెరదీయం సరికాదన్నారు. గత విద్యా సంవత్సరం అంతా బదిలీల పేరుతో కాలయాపన చేసి గందరగోళానికి గురిచేశారని విమర్శించారు. తక్షణమే షెడ్యూల్‌ను ప్రకటించి మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు మాట్లాడుతూ తాత్కాలిక సర్దుబాట్ల ద్వారా ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరీ కిందకే వస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలు ప్రమోషన్లు ఇవ్వకుండా తప్పించుకునేందుకు మార్గంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎపిటిఎఫ్(1938) ప్రధాన కార్యదర్శి టి.చలపతిరావు, బిటిఎ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామారావు, పి.ప్రతాప్ కుమార్, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

టెక్కలిలో వైసిపి జెండా ఎగరాల్సిందే

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి - పోలాకి

వచ్చే ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరాల్సిందేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన దువ్వాడ వాణి మబుగాంలో కృష్ణదాస్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి టెక్కలి నియోజకవర్గ నాయకులు సమన్వయంతో ఉన్నారని, ఎలాంటి లోటుపాట్లు, పొరపాట్లకు తావివ్వకుండా పనిచేయాలని సూచించారు. జగన్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయని మంచి ఫలితం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి, తన నియామకాన్ని బలపరిచి ప్రోత్సహించిన కృష్ణదాస్‌కు రుణపడి ఉంటానని వాణి అన్నారు.

కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న దువ్వాడ వాణి

మాట్లాడుతున్న నాగమణి

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సర్వజనులకు ఆరోగ్యం అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశావర్కర్లకు జీతభత్యాలు చెల్లించడంలోను, ఉద్యోగ భద్రత కల్పించడంలోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకులు కె.నాగమణి అన్నారు. టెక్కలి బిఎస్‌జెఆర్ పాఠశాల ఆవరణలో ధనలక్ష్మి అధ్యక్షతన టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల ఆశావర్కర్ల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు అమలు చేయలేదని, హామీలు అమలు జరపాలని కోరుతున్న ఆశాలను బెదిరించడం, వేధించడం చేస్తున్నారని అన్నారు. మరో పక్క ప్రభుత్వ పథకాలు ఏవీ ఆశావర్కర్లకు అమలు చేయడం లేదని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు మాట్లాడుతూ కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మ్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారానే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వ నిర్బంధాలను, వేధింపులకు వ్యతిరేకంగా సమైక్యంగా, చైతన్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, ఆశావర్కర్లు విజయ, కుంతీ, సుజాత, అన్నపూర్ణ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ సోమవారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు కూలీ సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని అన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగ సంక్షోభం రైతాంగ పరిస్థితులపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిచేందుకు మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. ఉదయం 11 గంటలకు అరుణ పతాక ఆవిష్కరణతో సభ ప్రారంభం అవుతుందన్నారు. ప్రారంభోపన్యాసకులుగా ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు దంతులూరి వర్మ, గణేష్ పండా అనిల్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. భోజనం విరామం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రతినిధుల సభ, నూతన కమిటీ ఎన్నిక, జిల్లా రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఉంటాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రజా ప్రదర్శన బాపూజీ కళామందిర్ నుంచి పాత బస్టాండ్ వరకు చేపడతామని చెప్పారు. సభ ప్రాంగణంలోనూ ప్రదర్శనలోనూ ప్రజా కళాకారుల సమాఖ్య కళారూపాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాతంత్ర వాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్‌టిఆర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమ పథకాలకు ఆద్యుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు అని టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎస్.మురళి అన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా పారిశ్రామిక వాడ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కేకును కట్ చేసి కార్యకర్తలు ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఇంజరాపు విశ్వనాథం, తమ్మినేని అమర్నాథ్, వండాన ఉదయ్, గుడ్ల దుర్గాప్రసాద్, రుప్ప రామచంద్రరావు, బగాది భాస్కరరావు, గురుగుబెల్లి నాగేశ్వరరావు, కూన అప్పలనాయుడు, గొల్లపల్లి సింహాద్రి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాళ్ల ధర్మారావు, దక్కత ఢిల్లీరావు, ఆశీలీల రాణి, కాళ్ల జయదేవ్, నందిగాం కోటేశ్వరరావు, ఎస్.ఎన్.పండా, కాళ్ల గోపి, రంగాల శ్రీనివాసరావు, దక్కత కామేశ్వరరావు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పలాస : కాశీబుగ్గ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ వంకల కూర్మారావు, కౌన్సిలర్ ప్రతినిధి డొక్కరి శంకర్, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు చాపర గణపతి, మాజీ ఎంపిపి మట్ట సుందరమ్మ, మాజీ సర్పంచ్ బెహరా కృష్ణవేణి, బెహరా కాళి, మెండ దమయంతి, కోళ్ల వసంత్, బగాది సునీల్, జీరు వెంకటరెడ్డి, సోడిమూడి కిరణ్‌కుమార్, ఆవల శ్రీరాములు, పెదరట్టి మణి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కోటబొమ్మాళి : స్థానిక ఎన్‌టిఆర్ పార్కులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, బోయిన రుత్విక్, దేవాది సింహాద్రమ్మ, రోణంకి లీలామోహన్, కర్రీ అప్పారావు, లాడి శ్రీను, వాన లక్ష్మి, తండుగు సునీల్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

సోంపేట : సోంపేట ఆరోగ్య వరం ఆస్పత్రి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు బీన ఆనందరావు, బీన ఈశ్వరరావు, వి.ఎం.గాంధీ, దేవి చిట్టిబాబు, కె.రాఘవదాసు, మడ్డు రవి, తేజస్వరరావు, జోగారావు మల్లా కోదండరావ్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

టెక్కలి : నివాళ్లర్పిస్తున్న నాయకులు

కవిటి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆమదాలవలస : కేక్ తినిపిస్తున్న మురళి

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాజీ ఎంపీ కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయులు కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. టెక్కలిలోని సత్తారు లాకనాథం కళ్యాణ మండపంలో బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ముందుగా రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు నిర్మాణ ఆద్యుడు రాజగోపాలరావు అని కొనియాడారు. ఆరుసార్లు ఎంపీగా ఎన్నికై జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. మారుమూల గ్రామాలకు పాఠశాలలు మంజూరు చేయించిన ఘటన ఆయనకే దక్కిందని అన్నారు. ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ, నైర వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు దువ్వాడ వాణి, దుబ్బ వెంకటరావు, వసంతరెడ్డి, ఎంపిపిలు అట్లా సరోజనమ్మ, నడుపూరి శ్రీరామ్మూర్తి, బిజెపి నాయకులు అట్టాడ రవిప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కూరమాన బాలకృష్ణ, కెల్లి జగన్నాథం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న కృపారాణి

సోంపేట: పట్టణంలోని ప్రయివేట్ కళ్యాణ మండపంలో మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, కాలింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొన్నారు. రాజగోపాలరావు జిల్లాకు, రైతాంగానికి చేసిన సేవలను గురించి గుర్తుచేసుకున్నారు. అనంతరం రాజగోపాల్‌రావు జీవిత విశేషాలు అన్న పరిచే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల (లల్లు), ఎంపిపి నిమ్మన దాసు, నర్తు నరేంద్ర యాదవ్, పూడి నేతాజీ, ఎన్.బాబూరావు, రౌతు విశ్వనాథం, పి.తిలక్ పాల్గొన్నారు.

సోంపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

క్రైమ్ కార్నర్

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని కురుడు పంచాయతీ యరకయ్యపేటకు చెందిన మట్ట తులసమ్మ (46) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తులసమ్మ శనివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. అయితే ఆదివారం గ్రామానికి కొంత దూరంలో ఉన్న యర్రబంద చెరువు గట్టుపై ఉన్న తోటలో చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. దీనిని గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. టెక్కలి ఇన్‌ఛార్జి సిఐ డి.రాము సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని కిందికి దించి పంచనామ నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తులసమ్మ భర్త గంగులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. మృతురాలికి కుమారుడు నవీన్, కుమార్తె కళ్యాణి ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గోకర్ణపల్లిలో కొట్లాట

ప్రజాశక్తి- పొందూరు

ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

మండలంలోని గోకర్ణ పల్లి వద్ద ఉన్న నారాయణపురం కుడి కాలువ సమీపంలో ఇసుక బండి పార్కింగ్ విషయంలో ఆదివారం తలెత్తిన వివాదం ఇరు గ్రూపుల మధ్య ఘర్షణకు దారితీసింది. నారాయణపురంలో కాలువలో ఒక గ్రూపుకు చెందిన వారు చేపలు పడుతున్నారు. అదే సమయంలో మరో గ్రూపునకు చెందిన దుప్పల అప్పలసూరి గట్టు పక్కన ఇసుక బండిని పార్కింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. అక్కడ ఉన్న ద్విచక్రవాహనం తీయనమని చెప్పడంతో మాటామాటా పెరిగి ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో ఒకే గ్రూపునకు చెందిన దుప్పల అప్పలసూరి, చౌదరి వెంకటఅప్పారావుకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.

పోలీసుల సమక్షంలోనే...

గ్రామంలో ఈ నెల 19న చెరువులో చేపలు పట్టే విషయంలో వివాదం నెలకొంది. దీంతో సమస్యాత్మక గ్రామం కావడంతో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు అప్పటి నుంచి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో పికెట్ కొనసాగుతుండగా ఆదివారం మరలా ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పోలీసుల సమక్షంలోనే ఇరు గ్రూపులకు చెందిన వారు కర్రలతో ఘర్షణకు దిగారు. ఇందులో ఒక గ్రూపునకు చెందిన ఇద్దరు గాయపడ్డారు. దీంతో అక్కడ ఉన్న పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మణరావు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఒరిగిన లారీ, నిలిచిన గూడ్స్ రైలు

రైల్వే ట్రాక్‌పై ఒరిగిన లారీ నిలిచిన గూడ్స్ రైలు

టెక్కలి: మండలంలోని సీతాపురానికి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆదివారం మధ్యాహ్నం గ్రానైట్ లోడు రాయితో వెళ్తున్న లారీ ఒరిగిపోయింది. ప్రమాదం జరిగిన కొద్ది సమయానికే నౌపడా నుంచి గుణుపూర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు రావడంతో గ్రామస్తులు అప్రమత్తమై నిలుపుదల చేయించారు. టెక్కలి నుంచి లింగాలవలస వైపు గ్రానైట్ రాయి లోడుతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. అయితే సదరు లారీ రైల్వే ట్రాక్ పక్కనున్న రైలింగ్ దాటి పట్టాలపైకి ఒరిగిపోవ డంతో పెద్ద ప్రమాదమే సంభవించిందని భావించి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. అనంతరం గ్రామస్తులు రైల్వే అధికారులు సమాచారం అందజేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంలో లారీని పక్కకి తప్పించారు. అనంతరం యథావిధిగా గూడ్స్‌ను కదిలించారు. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పద్మారావును సన్మానిస్తున్న జెడ్‌పిటిసి యశోద

అండమాన్ నికోబార్ కౌన్సిలర్‌కు సన్మానం

సోంపేట: మండలంలోని పలాసపురానికి చెందిన బల్ల పద్మారావు ఇటీవల అండమాన్ నికోబార్‌లో నిర్వహించిన కౌన్సిలర్ల ఎన్నికల్లో కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. ఈ మేరకు జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావులు పద్మారావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మారావు మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు.

సుద్దముక్కపై ఎన్‌టిఆర్ బొమ్మ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఎన్.టి.రామారావు ఆదివారం శత జయంత్సుత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డు గాంధీనగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారులు, స్వర్ణరత్న బిరుదాంకితులు కొత్తపల్లి రమేష్ ఆచారి సుద్దముక్కపై ఎన్‌టిఆర్ బొమ్మను గీశారు. దీని తయారీకి మూడు గంటల సమయం పట్టినట్లుగా ఆయన తెలిపారు. సుద్దముక్కపై అద్భుతంగా చెక్కి దానిపై వాటర్ కలర్లను వేసి మరింత అందంగా తయారు చేశారు.

- ప్రజాశక్తి, పలాస

వంతెనల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి

వివరిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలోని సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో పిఎంజిఎస్‌వై ద్వారా అనుమతులు పొందిన ఐదు వంతెనల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని సీడ్ ఎపి చైర్మన్ సాఢి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలోని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. బూర్జపాడు నుంచి డొంకూరు వెళ్లే మార్గంలో రెండు, బారువా నుంచి రట్టి వెళ్లే మార్గంలో రెండు, మహేంద్ర తనయా నుంచి బారువా ఒకటి వంతెనలు ఉన్నాయని అన్నారు. ఈ వంతెనల నిర్మాణాలకు అడ్మినిస్ట్రేటివ్, ఫైనాన్సియల్ అనుమతులు వచ్చాయని, పనులు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా అరకభద్ర వద్ద ప్రస్తుతం వంతెన పనులు చేపడుతున్నారని, అప్రోచ్ రోడ్డు నిర్మించాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీనిచ్చారని ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మంత్రి ధర్మానను కలిసిన నిరుద్యోగులు

కోటబొమ్మాళి: మూడేళ్లుగా పశుసంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న పశువైద్య సహాయకులు పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. మేనేజ్‌మెంట్, వెటర్నరీ పాలిటెక్నికల్, డెయిరీ సైన్సు చదువుకున్న విద్యార్థులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 30 వేల మంది మంది విద్యార్థులు కోర్సులను పూర్తి చేసి ఉన్నారని అన్నారు. సచివాలయ మూడో నోటిషికేషన్‌లో భాగంగా పశువైద్య సహాయకులు పోస్టుల నోటిషికేషన్ విడుదల చేయాలని కోరారు. చాలా డబ్బులు కోచింగ్‌ల కోసం ఖర్చు చేశామని వివరించారు.

వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

భాస్కరరావు విగ్రహావిష్కరణ

కంచిలి: జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కీర్తిశేషులు పలికిల భాస్కరరావు పార్టీలకతీతంగా మండలాన్ని, జాడుపూడి పంచాయతీని అభివృద్ధి చేశారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి పైల దేవాస్‌రెడ్డి అన్నారు. జాడుపూడిలో భాస్కరరావు కుమారుడు పలికల జయరాం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరితో కలుపుగోలుగా ఉంటూ, సమస్యల పరిష్కారానికి భాస్కరరావు కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పలికల ద్రాక్షాయని, కొనపల సురేష్, గోనప సింహాచలం, లడ్డు కేశవ్ పాత్ర బృందావన్ సాహూ పాల్గొన్నారు.

'అన్నపూర్ణేశ్వరిదేవి' ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- మందస

మందసలో ఆదివారం అన్నపూర్ణేశ్వరదేవి గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారులు దాసరి గణేశ్వరరావు ఇంటి ముందు ఆలయం నిర్మించారు. దీనిని కన్నవారి ఇంటిగా అందరూ భావిస్తారు. జూన్ 6 వరకు అమ్మవారికి ప్రధాన అర్చకులు గోవింద్ కహల్య, దువిష్టిలు పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి అమ్మవారి ఆలయం నుంచి మందస దేవాంగుల వీధి. దాసరి గణేష్ ఇంటికి అమ్మవారిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఇప్పటి నుంచి తొమ్మిది రోజుల పాటు అక్కడే ఉండి గ్రామంలోని 28 పుర వీధుల్లో రోజుకు నాలుగు వీధులు చొప్పున అమ్మవారిని మేళతాళాల మధ్య ఊరేగిస్తారు. తొమ్మిది రోజుల వ్యవధిలో అమ్మవారిని గ్రామమంతా మూడు సార్లు తిప్పుతామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రూ.లక్షల వ్యయంతో గ్రామమంతా చేపట్టిన విద్యుత్ ఆలకరణ పలువురిని ఆకట్టుకుంది.

అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

కార్యక్రమంలో అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కళా జాతర

ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పీత గంగయ్య బృందం తప్పెట గుళ్ళ , బంగారి వలస సింహాచలం బృందం జముకుల పాట, గొర్లె మహేష్ బృందం ఎరుకులపాట, తోట సిమ్మయ్య బృందం సన్నాయి, డప్పులు, సాలిన జోగారావు బృందం పగటి వేషాలు తదితర జానపద కళారూపాలు ప్రదర్శిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాష జానపద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు నిర్వహిస్తాని అన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాలు మృగ్యం

12వ వార్డులో నిల్వ ఉన్న మురుగునీరు

● అవస్థలు పడుతున్న ప్రజలు
● స్పందించని నాయకులు, అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ ఏర్పడి సుమారు 30 ఏళ్ల గడిచిపోయింది. ఇప్పటి వరకు ఐదు పాలకవర్గాలు పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. కానీ, వార్డుల్లో రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పేరుకే మున్సిపాలిటీ, కానీ, వార్డుల్లో రోడ్ల పరిస్థితి చూస్తే పరమ అధ్వానంగా ఉన్నాయనే చెప్పాలి. శివారు వార్డుల్లోని రోడ్లు, డ్రెయినేజీల గురించి అసలు ఏమీ చెప్పనక్కర్లేదని పాలకులు, అధికారులు తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గాలు ఏర్పడినప్పుడల్లా మొట్టమొదటిగా చెప్పే మాట ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ కర్తవ్యమని అంటారు. కానీ, ఆచరణలోకి వచ్చేసరికి నీటి మీద రాతలే అని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. చాలా వార్డుల్ల గతంలో వేసిన సిసి రోడ్లు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకటో వార్డు పరిధిలోని తిమ్మాపురం, పార్వతీశంపేట, హుదూద్ కాలనీల్లో డ్రెయినేజీ, సిసి రోడ్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బి.ఆర్ నగర్‌లో కొన్నేళ్లుగా డ్రెయినేజీ, సిసి రోడ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. పలుమారులు పాలకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు మోక్షం లభించడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. 2008లో అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి హయాంలో సొట్టవానిపేట శివారున ఇందిరమ్మ ఇళ్లు పంపిణీలో భాగంగా పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. కానీ, అక్కడ రోడ్లు డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. మున్సిపాలిటీకి పన్నుల రూపేనా లక్షల రూపాయలు ప్రజలు చెల్లిస్తున్నా... మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పాలకులు విఫలమవుతున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కొన్ని వార్డుల్లో వెచ్చించి సిసి రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేసినా పనులు ముందుకు కదలని పరిస్థితి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టిసారించి మౌలిక సదుపాయాల కల్పించాలని వార్డుల్లోని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

బి.ఆర్ నగర్‌లో అభివృద్ధికి నోచుకోని రోడ్డు

ఘనంగా పాలపోలమ్మ ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు : పాతటెక్కలి పంచాయతీ లింగాలపాడులోఉన్న పాలపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ నాయనోరు ఇంటి నుంచి మేళతాళాలతో బయలుదేరి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోకి తీసుకొచ్చి పీఠంపై కూర్చోబెట్టారు. మంగళవారం వరకు పీఠంపైనే అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచుతామని, ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

పివిఎస్‌కు ఎన్‌టిఆర్ పురస్కారం

పురస్కారాన్ని అందజేస్తున్న బ్రహ్మారెడ్డి

ఆమదాలవలస : కవి, సాహితీవేత్త, సామాజిక సేవా కార్యకర్త, విశ్వ సాహితీ అధ్యక్షులు, పొన్నాడ అప్పల నరసమ్మ చిన్నవాడు సేవా సంస్థ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షులు పొన్నాడ వరాహ నరసింహులు (పివిఎన్ మాస్టారు)కు ఎన్‌టిఆర్ పురస్కారం లభించింది. బెంగళూరుకు చెందిన సిపి బ్రౌన్ సేవా సమితి స్వాతంత్ర సమరయోధులు ఇడమ కంటి బ్రహ్మారెడ్డి శ్రీకష్ణ దేవరాయ కళామందిరం తెలుగు విజ్ఞాన సమితి ప్రాంగణంలో ఆదివారం పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. తెలుగు శతక రచన పోటీల్లో కవి పివిఎన్ మాస్టారు రచించిన 'నందమూరి శతకం' బహుమతి కోసం ఎంపికైంది. బహుమతి ప్రదానంతో పాటు శతకాన్ని వేదికపై ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 13 మంది కవులను విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమానికి డాక్టర్ ఖాదర్ వలీ, రమాప్రభ, డాక్టర్ రాధాకృష్ణరాజు, తలారి సువర్ణ రాజు, వేటూరు ఆనందమూర్తి, బండి ఆదినారాయణ రెడ్డి, జాలారి సుభాషిని పాల్గొన్నారు.

మహానాడులో జిల్లా నాయకుల సందడి

పొందూరు: రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న టిడిపి మహానాడులో మండలంలోని నాయకులు పాల్గొని సందడి చేశారు. ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, కూన వెంకట సత్యనారాయణ, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, అనకాపల్లి శ్రీరంగ, ముగడ తవిటినాయుడు, అన్నెపు శ్రీనివాసరావు, కొంచాడ బుజ్జి, వాసుదేవరావు, రామారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణలు, నియోజకవర్గ పరిస్థితిని తెలుసుకునేందుకు వీలుగా నిరంతరం ప్రజల్లో ఉండి విజేతగా నిలవాలని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సూచించారు. రాజమహేంద్రవరంలోని వేమగిరిలో నిర్వహిస్తున్న టిడిపి మహానాడులో భాగంగా చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి భేటీ అయ్యారు. టిడిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని చంద్రబాబు ఆమెకు సూచించారు.

పలాస : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో రాజమహేంద్రవరంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, పలాస నియోజకవర్గం టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ఉన్నారు.

ఇత్తడితో ఎన్‌టిఆర్ శత జయంతి జ్ఞాపిక

రణస్థలం రూరల్ : టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు శత జయంత్యుత్సవాలు రామహేంద్రవరంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణా శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ఇత్తడితో తయారు చేయించిన ఎన్‌టిఆర్ శత జయంతిని జ్ఞాపికను మాజీ సిఎం చంద్రబాబునాయుడుకు అందజేశారు. ముందుగా దీనిని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. సారావకోట మండలం బుడితిలోని ఇత్తడి లోహంతో శిల్పాలు తయారు చేయడంలో సుప్రసిద్ధులైన శిల్ప కళాకారులతో దీనిని తయారు చేయించారు.

పొందూరు : రవికుమార్‌కు కేక్ తినిపిస్తున్న రామ్మోహన్

రణస్థలం రూరల్ : జ్ఞాపికను అందజేస్తున్న కలిశెట్టి

పలాస : మహానాడులో పాల్గొన్న గౌతు శిరీష

శ్రీకాకుళం అర్బన్ : చంద్రబాబును కలిసిన లక్ష్మీదేవి

పొందూరు : ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నందిగాం : నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

లావేరు : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985 నుంచి 90 వరకు 6 నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం తమ చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకరినొకరు పలకరించుకొని ఆత్మీయంగా కనిపించారు. 220 మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత ఉద్యోగాలతో పాటు రాజకీయంగా అభివృద్ధి చెందిన వారు ఉన్నారు. ఒకచోట కలుసుకోవడం ఆనందాన్ని ఇచ్చిందని ఎంపిపి, అప్పటి విద్యార్థి నదుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. పరిచయ కార్యక్రమం అనంతరం అప్పటి ఉపాధ్యాయులు పి.కృష్ణారావు, జినగ ఆదినారాయణ, పి.వెంకటేశ్వర్లు, పి.రామకృష్ణ ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబులను సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు అందించిన స్ఫూర్తిని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో సిహెచ్.నీరజరావు, డి.రామకృష్ణ, కె.బాబూరావు, సనపల ఆనందరావు పాల్గొన్నారు.

పొందూరు : మండలంలోని లోలుగు జెడ్‌పి ఉన్నత పాఠశాల 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఉత్సాహంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తరువాత అందరూ తమ పాఠశాలలో కలుసుకోవడం వారిలో మధురానుభూతిని నింపింది. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులతో కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. మధుర గీతాలతో, కేరింతలతో సభాప్రాంగణాన్ని రసమయం చేశారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు మీసాల సూర్యనారాయణ, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఎ.సంజీవరావు, ఉపాధ్యాయులు వంబర వెంకటరావు, పి.జగన్నాథం, కోనే శ్రీధర్, పి.వి.కృష్ణారావు, వాండ్రంగి కొండలరావు, ఎస్.బసయ్య, ఎల్.నందికేశ్వరరావు, ఎం.మల్లేశ్వరరావులకు దుశ్శాలువలను కప్పి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థి నాయకులు పైల లక్ష్మున్నాయుడు, పొట్నూరు జనార్ధనగుప్తా గురువుల సేవలను స్మరిస్తూ మాట్లాడారు.

లావేరు : మురపాక గుంటుకు అప్పల నర్సింహులు ఉన్నత పాఠశాలలో 1996-97 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కె.బసవరాజు, శాస్త్రి, కె.వెంకటరావు, బుచ్చిబాబు మాష్టార్లు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు అరుణ, మంగయ్య పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం జరిగింది. 1994-95 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు దారపు ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఎన్ని లోకనాథం, బల్ల సింహాచలం, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు గణపతిరావులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు జగన్నాథం పూరి, పూర్ణచంద్రరావు, గేదెల తిరుపతిరావు, రేఖాన నాగవల్లి పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్యకు స్వస్తి

ప్రజాశక్తి- పలాస

ప్రారంభిస్తున్న బృందావతి

కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో లో ఓల్టేజ్ సమస్యతో నిత్యం ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లో ఓల్టేజ్ సమస్యకు స్వస్తి చెప్పామని వార్డు కౌన్సిలర్ శిష్టి బృందావతి గోపి అన్నారు. కాశీబుగ్గ సూదికొండలో విద్యుత్ శాఖ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీబుగ్గ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లో ఓల్టేజి సమస్య ఉందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. మంత్రి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఓల్టేజ్ సమస్య పరిష్కరించారని అన్నారు. కాశీబుగ్గ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి అదనపు లైన్ వేసి 40 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి ఎఇఇ నాగభూషణరావు, స్థానిక నాయకులు సీపాన లోకేష్, తంగుడు కామరాజు, మార్పు చిన్న, వాలంటీర్లు కె.ఆది పాల్గొన్నారు.

బాబూరావుకు సన్మానం

సన్మానిస్తున్న శేషాద్రినాయుడు

పలాస : విజయనగరంలోని కనపాక వీధిలో యువ సంఘం భవన్‌లో టౌన్ ప్రెసిడెంట్ అప్పారావు అధ్యక్షతన ఉత్తరాంధ్ర పరిధిలో అభిమానులు ఆదివారం ఎన్‌టిఆర్ శత జయంత్యుత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా పలాసకు చెందిన తాళ్లభద్ర బాబూరావుకు విజయనగరం డిఎస్‌పి శేషాద్రినాయుడు దుశ్శాలువ కప్పి సన్మానించారు. నందమూరి వీరాభిమానిగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తన శక్తి మేరకు సేవలందించి అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా బాబూరావు గుర్తింపు పొందారు. నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘానికి పలాస టౌన్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. పలాసకు చెందిన శివయ్యకూ చిరు సత్కారం అందజేశారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

సిఐకు ప్రశంసలు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు, లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు పరిష్కారమయ్యే దిశగా కృషి చేశారు. ఈ మేరకు ఎస్‌పి జి.ఆర్.రాధిక ప్రశంసించారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్‌పి కార్యాలయంలో శనివారం నిర్వహించిన నేర విభాగం సమీక్షలో సిఐ శ్రీనివాసరావుకు జ్ఞాపికను అందజేశారు. అనంతరం సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును అభినందించారు.

వడ్డంగి ప్రీమియర్ లీగ్ విజేత కొండవాడ

భామిని: మండలంలోని వడ్డంగిలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డంగి ప్రీమియర్ లీగ్ క్రికెట్‌లో జిల్లాలోని వివిధ మండలాల నుండి 30 జట్లు పాల్గొన్నాయి. గత వారం నిర్వహించిన లీగ్‌లో ఆదివారం కొండవాడ, కిచ్చాడ గ్రామ జట్ల మధ్య ఆఖరి ఉత్కంఠ పోరులో కొండవాడ ప్రీమియర్ లీగ్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్ నిర్వహణ వల్ల ప్రాంతాల మధ్య దూరం తగ్గి, స్నేహ భావం పెరుగుతుందని, యువ్వనంలో క్రీడలు ఆడడమంటే భవిష్యత్తు ఆరోగ్యం పదిలం చేసుకోవడమేనని తెలిపారు. ఈ లీగ్‌లో విజేతగా నిలిచిన కురుపాం మండలం కొండవాడ జట్టు కెప్టెన్ పవన్‌కు ట్రోఫీతో పాటు రూ.15వేలు నగదు బహుమతిని వైసిపి సీనియర్ నాయకులు శ్రీనుబాబు, సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి, గోపాల్ దాస్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కిచ్చాడ గ్రామ క్రికెట్ జట్టు కెప్టెన్ సాయికి రూ.10వేలు నగదు బహుమతితో పాటు రన్నర్ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

ట్రోఫీని గెలుచుకున్న కొండవాడ జట్టు సభ్యులు

మహిళా భద్రతపై అవగాహన

ఆమదాలవలస : ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆమదాలవలస: రుతుస్రావంపై స్థిరమైన అవగాహనతోనే మహిళల ఆరోగ్యం మెరుగుపడుతుందని మెప్మా అధికారిని పి.విజయకుమారి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ రుతుస్రావ దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యాన స్వయం సహాయక సంఘాల సభ్యులకు క్షేత్రస్థాయిలో ఆదివారం విరివిగా అవగాహన కల్పించారు. ఆధునిక జీవనశైలిలో ఇప్పటికీ రుతుస్రావ సమస్యలపై అపోహలు, మూఢనమ్మకాలు సరికాదన్నారు. రుతుస్రావ సమస్యలపై మహిళలు మేల్కొంటేనే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందగలరని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మహిళల భద్రతపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని మెప్మా ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం అవగాహన కల్పించారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సుకన్య, ఎఎన్‌ఎంలు ఇంట్లో ఉన్న 15 ఏళ్ల ఆడ పిల్లలపై ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలన్నదానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు

టెక్కలి : అవగాహన కల్పిస్తున్న మోహనరావు

శ్రీకాకుళం : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాలల విద్యార్థులకు అదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. సోషల్ ఉపాధ్యాయులు తంగి.ఎర్రమ్మ పాల్గొని జనరల్ నాలెడ్జిపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఈ తరహా శిబిరాలు పిల్లల్లో భావోద్వేగ మేధస్సును పెంపొందించేందుకు కొత్తమార్గమని అన్నారు. రోజూ పిల్లలు గ్రంథాలయానికి వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.ఈశ్వరరావు, రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.

ఆంగ్లంలో అవగాహన అవసరం.

టెక్కలి : చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో అవగాహన అవసరమని విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు జి.మోహనరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆంగ్లంపై ఆవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్, సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట: స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువత హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహార వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి సరదాగా ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

మినీ ట్రైన్ ఎక్కి సందడి చేస్తున్న చిన్నారులు

కళాకారులను సన్మానిస్తున్న ఎంపిపి దాసు

ఘనంగా కళాకారుల దినోత్సవం

సోంపేట: మండలంలోని బేంకిలిలో ఆదివారం కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కళాభారతి సంక్షేమ కళాకారుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక కళాకారులను సత్కరించి, జ్ఞాపకాలు అందజేశారు. కార్యక్రమంలో సింహాచలం పాడి, ఎర్ర గాంధీ, నిమ్మన పార్వతీశం, శివాజీ పాణిగ్రాహి, దేవేంద్ర పంట, ముప్పన ఈశ్వరరావు, జినగ కృష్ణ, బృందావనం పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

వీరఘట్టం: మండలంలోని చిదిమి- పివిఆర్ పురం గ్రామాల మధ్య రహదారి చినుకు పడితే చిత్తడిగా మారింది. ఇటీవల కురుస్తున్న అడపాదడప వర్షాలకు ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిసారి వర్షం పడిన ఇదే పరిస్థితి ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.